# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## రామ్ నాథ్ .కె.

### (విజయచిత్ర – 1994, అక్టోబర్ సంచిక నుంచి )



అటు కళాత్మకమూ ఇటు ప్రజారంజకమూ అయిన చిత్రాలు నిర్మించాలని బి. ఎన్. రెడ్డి, బి. నాగిరెడ్డి, కె.వి. రెడ్డి మొదలైన ప్రముఖులతో వాహినీ సంస్థ (1938) వెలిసినప్పుడు ఆ సంస్థకు మూలస్తంభంగా నిలబడి, నడిపించిన టెక్నీషియన్ కె.రామ్ నాథ్. రామ్ నాథ్ పాలఘాట్ కు చెందిన తమిళ బ్రాహ్మణుడు. పట్టభద్రుడు కాగానే, సినిమా నిర్మాణం మీద వున్న ఉత్సాహంతో, సినిమాటోగ్రఫీ నేర్చుకున్నాడు. సినిమాకు సంబంధించిన టెక్నికల్ పుస్తకాలు చదివి, ఉత్తమ ఆంగ్ల చిత్రాల ధోరణులను గ్రహించి, 'స్క్రీన్ ప్లే రైటింగ్' మీద కృషి చేశారు.

పి.వి. దాసు కొందరు మిత్రులతో మద్రాసులో వేల్ పిక్చర్స్ పేరిట చిన్న స్టూడియోని ఆరంభించి, తొలి చిత్రంగా 'సీతా కల్యాణం' (1934) నిర్మించారు. అంతకు ముందు వచ్చిన తెలుగు సినిమాలన్నీ ఉత్తర భారతదేశంలో తయారైనవే. 'సీతా కల్యాణం' మద్రాసులో తయారైన తొలి తెలుగు చిత్రం. తమిళంలో కూడా 'సీతా కల్యాణం' నిర్మింపబడింది. ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడు, స్క్రీన్ ప్లే రచయితా కె. రామ్ నాథ్. అక్కడే కళా దర్శకుడు ఎ.కె.శేఖర్ కూడా కలిశారు. శేఖర్ ఆ చిత్రానికి కళా దర్శకుడు, శబ్దగ్రాహకుడు. అలా 'రామ్ నాథ్ – శేఖర్' ల జంటను వేల్ పిక్చర్స్ అదే యూనిట్ లో 'శ్రీ కృష్ణలీలలు' (1935) నిర్మించింది. ఈ చిత్రంలోనే రాజేశ్వరరావు కృష్ణుడి పాత్రలో పరిచయమైనారు. రామ్ నాథ్ 'సుందరమూర్తి నయనార్' మొదలైన కొన్ని తమిళ చిత్రాలకి ఛాయాగ్రాహకుడిగా పనిచేసిన తర్వాత ఆయన బి. ఎన్. రెడ్డి మొదలైన ప్రముఖులు 'వాహిని' ఆరంభించినప్పుడు ఆ సంస్థలో చేరారు. అంతకుముందు 'గృహలక్ష్మి' నిర్మాణంలో పాలుపంచుకున్న బి. ఎన్. బి. నాగిరెడ్డి, కె.వి. రెడ్డి, నాగయ్య మొదలైన వారు వాహిని సంస్థకు అంకురార్పణ చేశారు. ఉత్తమ కళా దృష్టితో , సమాజ పరమైన

సమస్యలను తీసుకుని చిత్రాలు తియ్యాలని వాహిని సంస్థ పథకాలు వేసింది. తొలి చిత్రం 'వందేమాతరం' జాతీయోద్యమం ముమ్మరంగా సాగిపోతున్న ఆ రోజుల్లో 'వందేమాతరం' పేరు ఉచితంగా వుంటుందని ఆ చిత్రానికి పెట్టినా, కధాంశం నిరుద్యోగం. బి. ఎన్. రెడ్డి ఆ కథను అల్లారు. కె. రామ్ నాథ్ అదనపు సన్నివేశాలూ కల్పించి 'స్క్రీన్ ప్లే' తయారుచేశారు. ఆయనే ఛాయాగ్రాహకుడు కూడా. శేఖర్ కళా దర్శకుడు. ఏ మాత్రం టెక్నికల్ సౌకర్యాలు లేని ఆ రోజుల్లో ఉన్న లైట్లు, కెమెరా లెన్స్ ల తోనే రామ్ నాథ్ అద్భుతంగా చిత్రీకరించారనీ, ఉత్తర భారత చిత్ర ప్రముఖులు కొనియాడారు. అతి సహజమైన సెట్లు, వాటికి తగ్గ సహజమైన లైటింగు, మూడ్ ఫోటోగ్రఫీ వంటివి ఆ చిత్రంలో కనిపిస్తాయి. వాహినీ సంస్థ భావించినట్టుగానే 'వందేమాతరం' ఉత్తమ కళాత్మక చిత్రంగా తయారై ప్రేక్షకుల్ని అలరించింది. ఆ చిత్రంతోనే ఆంధ్ర ప్రేక్షకులు తెలుగు సినిమాలలో కొత్త సంస్కారాన్నీ, వరవడినీ చూశారు. తర్వాత వాహినీ వారు 'సుమంగళి' (1946) తీశారు. బాల్య వివాహాలు, బాల వితంతువులు అగచాట్లు మీద నిర్మింపబడిన ఈ చిత్రానికి కూడా రామ్ నాథే స్క్రీన్ ప్లే రచయితా, ఛాయాగ్రాహకుడూ. మొదటి చిత్రంలో హీరోగా నటించిన నాగయ్య. ఈ చిత్రంలో వృద్ధ పాత్ర ధరించడం సాహసంగా అభివర్ణింపబడింది.

స్క్రీన్ ప్లే తయారు చెయ్యడంలో సిద్ధహస్తుడని ఇవాళ్టి వరకూ చెప్పుకుంటున్న కె. వి. రెడ్డి, రామ్ నాథ్ దగ్గరే అక్షరాభ్యాసం చేశారు. సినిమాలలో పాత్రల పరిచయలూ, సన్నివేశాలు, వాటి పొడుగు, ఏ సన్నివేశం తర్వాత ఏ సన్నివేశం రావాలి – వంటి మెలకువలన్నీ కె. వి. రామ్ నాథ్ దగ్గర నేర్చుకున్నారు. బి.ఎన్. రెండు చిత్రాలు డైరక్టు చేసిన తర్వాత, మూడో చిత్రాన్ని డైరక్టు చేసే అవకాశం కె. వి. రెడ్డికి లభించింది. వాహిని సంస్థ స్థాపకుల్లో మూలపురుషుడయిన మూలా నారాయణ స్వామి, రామ్ నాథ్ ల ప్రోత్సాహం కె. వి. కి లభించాయి. కె. వి. రెడ్డి అంతకు ముందు నుంచే తాను దర్శకుడైతే మహా భాగవత కర్త బమ్మెరపోతన కథను చిత్రంగా తియ్యాలని ఆశపడి, అందుకు సంబంధించిన వివరాలు సేకరిస్తూ వచ్చారు. ఐతే, 'పోతన' జీవితంలో కథ తక్కువ. సినిమాకు అనుకూలించే కథ కాదు. ఉన్నదాన్ని అలాగే తీస్తే 'డాక్యుమెంటరీ' అవుతుంది. ఆ ఉద్దేశంతో 'పోతన' చిత్ర నిర్మాణానికి అట్నుంచి ఇట్నుంచి నిరుత్సాహపు కెరటాలు ఉవ్వెత్తున లేచాయి. ఐతే, రామ్ నాథ్, కెవిలు ఇద్దరూ ఆ కథను చిత్ర కథగా మలచి భక్తి పరమైన చిత్రంగా నిలుపుతామని కృషి చేశారు. సముద్రాల రాఘవాచార్య అందజేసిన పోతన జీవితపు దృశ్యాలు ఆధారంగా రామ్ నాథ్ స్క్రీన్ ప్లే రాశారు. శ్రీనాధుడి కుమార్తె పోతన ఇంట్లో ఉండడం, పోతన కుటుంబం ఆమెను తమ కోడలుగా చేసుకోవాలనుకోవడం, బీద వారికి తన కూతుర్ని ఇవ్వడానికి శ్రీనాధుడు అంగీకరించకపోవడం వంటి సన్నివేశాలను సృష్టించి, కథకు బలం చేకూర్చారు. హనుమంతుడు పోతన ఇంటిని కాపలా కాయడం, శ్రీరామచంద్రుడు పోతన ఇంటికి అతిధిగా రావడం మొదలైన సన్నివేశాలు సినిమెటిక్ కల్పన 'పోతన' కు ఛాయాగ్రాహకుడు కూడా రామ్ నాథే. పోతన మహా పురుషుడనే భావాల్ని చెప్పడానికి చిత్రం అంతా ఆయన. పోతన తలపైన లైటింగ్ తో కాంతి వలయాన్ని సృష్టించారు. ట్రిక్ ఫోటోగ్రఫీ లో కూడా రామ్ నాథ్ సిద్ధహస్తుడని 'పోతన' చిత్రం చాటింది. ఆప్టికల్ యంత్రాలు, రకరకాల లెన్స్ లు లేని రోజుల్లో ఉన్న సౌకర్యాలనే వినియోగించుకుని, రామ్ నాథ్ చేసిన 'ట్రిక్స్' ప్రేక్షకుల్ని అలరించాయి. పోతన ఇంట్లో ప్రవేశించడానికి వచ్చిన రాజభటులకి ఇంటి ముందు తిరుగుతూ కోతి కనిపిస్తుంది. ఆ కోతే హనుమంతుడి రూపం ఎత్తి పర్వతాకారంలో కనిపించి, ఆజామిళుడిని చేతిలోకి తీసుకుంటుంది. అర చేతిలో వున్న ఆజామిళుడిని హనుమంతుడు ఊది పారేస్తే అతను ఆకాశంలో పల్టీలు కొట్టి పడిపోతాడు.

ఈ దృశ్యంలో ఎక్కడా లోటు అనేది కనిపించకుండా, 'పెర్ ఫెక్ట్' గా తీశాడని, రామ్ నాథ్ శ్లాఘిస్తూ ఆంగ్ల పత్రికలు రాశాయి. రామ్ నాథ్, శేఖర్ లు ఇద్దరూ జెమినీ సంస్థ చేత ఆకర్షింపబడ్డారు. శేఖర్ వాహినీ సంస్థను పూర్తిగా విడిచిపెట్టక తప్పలేదు. జెమినీ సంస్థ తీసిన 'మంగమ్మ శపధం' చిత్రానికి కె. రామ్ నాథ్ ఛాయాగ్రాహకుడు. కథాకల్పనలోనూ నిష్ణాతుడనిపించుకున్న రామ్ నాథ్ 'మంగమ్మ శపథం' చిత్ర నిర్మాణంలో ప్రముఖంగా పాల్గొని, ఆ చిత్రం అఖండ విజయం సాధించడానికి దోహదం చేశారు. 'మంగమ్మ శపథం' ఆంధ్ర దేశంలో కూడా వంద రోజులకు పైగా ఆడింది. ఆ చిత్రాన్నే జెమినీ సంస్థ 1951లో 'మంగళ' పేరుతో తెలుగులో నిర్మించింది.

పక్షిరాజా స్టూడియోవారు 'బీదల పాట్లు' (1950) నిర్మించారు. ఇది తమిళ, తెలుగు భాషల్లో ఏకకాలంలో నిర్మింపబడింది. విక్టర్ హ్యూగ్ క్లాసిక్ 'లెమిజరబుల్స్' ఆధారంగా 'బీదల పాట్లు' తయారైంది. అంతకు ముందు వచ్చిన ఆంగ్ల చిత్రం కొంత ఆధారమైనా, 'బీదలపాట్లు' లో ఆ వాతావరణం కనిపించకుండా 'ఇండియన్ నైట్' చేసి చిత్రీకరించారు రామ్ నాథ్. ఈ చిత్రానికి ఆయనే దర్శకుడు కూడా. రెండు భాషల్లోనూ 'బీదల పాట్లు' గొప్ప విజయాలు సాధించి, 'ఉభయతారకం' గా పేరు తెచ్చుకుంది.

దాక్షిణాత్య చిత్ర చరిత్రలో భారీ చిత్రం' అనిపించుకోదగ్గ రీతిలో చిత్ర నిర్మాణం చెయ్యాలని జెమినీ సంస్థ అధినేత వాసన్ సంకల్పించి 'చంద్రలేఖ' తీశారు. ఇది కేవలం కల్పింపబడిన కథ. ఎక్కడా విసుగూ విరామం లేకుండా ఎక్కడిక్కడ మలుపులు తిరుగుతూ ఉత్కంఠతో సాగిపోయే 'చంద్రలేఖ' చిత్ర రూపానికి రామ్ నాథ్ శిల్పి. ఆ చిత్రానికి కమల్ ఘోష్ ఛాయాగ్రాహకుడే. అయినా, సర్కస్ దృశ్యాలన్నీ రామ్ నాథ్ తీశారు. క్లైమాక్స్ లో వచ్చే 'డ్రమ్ డాన్స్' ను కూడా ఆయనే చిత్రీకరించారు. సర్కస్ లోని ఒక షాట్ ను గొప్పగా తీశారని, అప్పుడు పరిశ్రమ గొప్పగా చెప్పుకుంది. చంద్రలేఖ పాత్ర సర్కస్ లోని 'ట్రెపీజ్' పొర వుంటుంది. ఆమెను వెంటాడుతున్ననాడు ప్రేక్షకుల్లో వుంటాడు. ఆమె అతన్ని గమనించింది. అతనూ ఆమెను చూశాడు. ట్రెపీజ్ మీద వున్న ఆమె దృష్టిలో అతను పడడాన్ని జూమ్ లెన్స్ స్థానంలో వుంచి, అతి వేగంగా ముందుకు నడిపించి ప్రేక్షకుల్లో వున్న అతన్ని చూపించారు. ఇలాంటి షాట్ ను రామ్ నాథ్ ఎంతో శ్రమించి సృష్టించారని నేటికీ చెప్పుకుంటారు. ఆ భారీ చిత్రం 'చంద్రలేఖ' అపూర్వమైన విజయం సాధించింది. ఆంధ్రదేశంలో శతదినోత్సవం (విజయవాడలో) జరుపుకున్న చిత్రం అదే.

భారీ చిత్రాలతో పాటు చిన్న బడ్జెట్ చిత్రాలు కూడా తీసి జనరంజకం చెయ్యవచ్చునని రామ్ నాథ్ వాసన్ తో చర్చించి, ఆర్. కె. నారాయణన్ నవలను 'మిస్ మాలిని' గా తీశారు. మోలియర్ నాటకాన్ని 'కన్నమ్మ ఎన్ కాదలి' పేరిట తీశారు. రెండు చిత్రాలూ బాక్స్ ఆఫీసు దగ్గర విశేషమైన విజయం సాధించాయి. రెండూ రామ్ నాథ్ డైరక్టు చేసినవే. ప్రఖ్యాత నాట్యకళాకారుడు ఉదయశంకర్ 'కల్పన' అనే నాట్య చిత్రాన్ని జెమినీ స్టూడియోలో తీశాడు. ఆ చిత్రానికి ఛాయాగ్రాహకుడు – రామ్ నాథ్. 'కల్పన' 'టెక్నికల్ స్థాయి' దేశ విదేశాల్లో విశేషంగా కొనియాడిబడింది. షేక్స్ పియర్ 'ట్వెల్త్ నైట్' ఆధారంగా 'కన్నయన్ కాదలి' అనే చిత్రాన్ని రామ్ నాథ్ డైరక్టు చేశారు. తాయి ఉళ్లమ్ విడుదలై అన్న చిత్రాల్ని కూడా ఆయన డైరక్టు చేశారు.

కె. రామ్ నాథ్ దక్షిణ భారతంలో గొప్ప సినీ టెక్నీషయన్. ఎందరో ప్రముఖులు ఆయన సాంగత్యంతో ప్రభావితులైనారు. సినిమాకి 'స్క్రీన్ ప్లే' అనేదే ముఖ్యాంశమని నమ్మి, చెప్పిన రామ్ నాథ్ మధ్య వయసులోనే తన 43వ ఏట 1956లో హైద్రాబాదులో మరణించారు.

తమిళ, తెలుగు చిత్ర రంగాలు రెండూ రామ్ నాథ్ కి ఎంతగానో ఋణపడి వున్నాయి 'సినిమా టెక్నికల్ మహా సముద్రం. నాకు తెలిసినది అందులో ఒక్క చుక్క మాత్రమే' అని ఆయన చెప్పినా, నిజానికి ఆయన నేర్పింది కొండంత. మనం నేర్చుకున్నది రాయంత. సినిమాలు తీసేవారికి, ఏ నాటికైనా రామ్ నాథ్ చిత్రాలు'. చక్కని పాఠాలు.

★★★

COMMENTS